"దీన్నే డిటెక్షన్ అంటారు. అంటే ఒక విషయం చూసి రెండోది గ్రహించడం. నీ దగ్గరున్నది సిగరెట్టు పెట్టె. దాన్ని బట్టి నువ్వు యెలాటి వాడివో నీవు వాడు కొనే యితర వస్తువులు ఎలాటివై యుంటాయో గ్రహించ గలిగి వుండాలి డిటెక్టివ్. నీ గురించి కావలిస్తే యింకా చెప్పగలను. నీకో ప్రియురాలు వుంది. కొంచెం బీదదనే చెప్పాలి. నల్ల మనుష్యుల్లో జమ. అల్లికలూ, కుట్లూ అంటే ఆమెకు చాలాసరదా. ఆవిడ నీకు యిచ్చిన బహుమతుల్లో పువ్వులుకుట్టిన ఎర్రడ్రాయరు ఒక టుంది. దానిమీద యీ వేళ ఉదయం నువ్వే పొరపాటున కాఫీ పోసుకున్నావు" ఎఫెక్టుకోసం ఆగేడు అవినాశ్.

ప్రసాద్‌కు మూర్ఛొచ్చినంత పని అయింది. అవినాశ్ చెప్పిన దంతా అక్షరాలా నిజం. కాని ఎలా కనిపెట్టేసేడా అన్నదే ఆశ్చర్యం !

"సార్ ! మీరు ఎలా ... " అని ప్రసాద్ అడుగుతుంటే 'ఇలా చెప్పగలగడం ఏం కష్టంలేదు' అంటూ అవినాశు బాబు అడ్డొచ్చేడు. "డబ్బున్న ప్రియురాళ్ళు ఊలు స్వెట్లర్లూ పార్కర్ పెన్నులూ, స్మగుల్డ్ వాచీలు ప్రెజెంట్సిస్తారు. ఎర్రనూలు డ్రాయరు కానుకిచ్చిన నీ ప్రియురాలు ధనవంతురాలు కాదు. టేబిల్ క్లాత్‌లమీదా, డోర్ కర్టెన్లమీదా కుట్లుకుట్టడం రివాజే. కాని లోపల తొడుక్కునే డ్రాయరుమీద ఎంబ్రాయిడరీ సాధారణంగా చెయ్యరు. దానిమీద కూడా అందంగా పువ్వులు కాయలూ కుట్టిందంటే నీ ప్రియురాలికి ఎంబ్రాయిడరీ అంటే విపరీతమైన యిష్టమని తెలుస్తుంది. సాధారణంగా ఎర్రరంగుని నల్ల ఆడ వాళ్ళు కోరుకుంటారు.

ఆ రంగు తమకి సరిపడదని వారికి తెలుసు. ఆ రంగు బట్టలు వారికి కట్టుకునే అవకాశం లేకుండా పోతుంది. అంచేత వారు యితర్లకి బట్టలు యిచ్చే టప్పుడు ఆ రంగునే ఎన్నుకుం టారు" అని ఆగిపోయేడు. ప్రసాద్ మెదడులో సుళ్ళు తిరగడం మొదలుపెట్టేయి. అతనికి యింకా సందేహాలు న్నాయి. 'కాని ఆ డ్రాయరు ఎర్ర రంగుదనీ దానిమీద పువ్వులున్నాయని, దానిమీద కాఫీ వొలక బోసుకున్నాననీ ఎలా కనిపెట్టేరు సార్?" అని నీరసంగా ప్రశ్నించేడు.

"ఈ విషయాలు కనిపెట్టడం అన్నిటికంటె సులువు" అని నవ్వుతూ ఆగిపోయేడు అవినాశ్.

ప్రసాద్ ఆతృత ఎక్కువైంది "ఎలా–సార్ !"

"మహా సులువు... నువ్వు పేంటు తొడుక్కోవడం మరచి పోయేవు ప్రసాద్" అంటూ నవ్వసాగేడు ప్రఖ్యాత డిటెక్టివ్ అవినాశ్ బాబు.

లెసన్ నెంబరు 1 : డిటెక్టివ్ కాదల్చుకున్నవారు పేంటు తొడుక్కోవడం మరిచిపోకూడదు.

అంటే, యితరులు మరచిపోవచ్చని కాదు.

**(జ్యోతి మాసపత్రిక, 1.4.1965)**

# అదృష్ట హీనుడు

"**పా**పం' కావేఁశానికింటి పేర్లాంటిది. 'పాపం కావేఁశం' అంటారంతా కావేఁశం గురించి ఏం మాట్లాడాల్సొచ్చినా.

పాపం చేసే పుట్టేనని కావేఁశం నమ్మకం.

ఈ జన్మలో మరింక ఏం పాపం చెయ్యకూడదని అతని ఆదర్శం.

కావేఁశం అంటే చాలామందికి అభిమానం, అమాయకు డని. ఎంతమంది అభిమానించినా సుఖపళ్ళేనిజీవి అతను. అతను మనస్ఫూర్తిగా నవ్వి ముప్ఫయి యేళ్ళయింది. అతని వయసిప్పుడు ముప్ఫై ఒకటి.

బట్టతల పాగాతో, బూజుపట్టినట్టున్న గడ్డంతో, చిరిగిన లాంకోటుతో, పొగచూరిన గోడకు వేలాడుతున్న ఫోటోలో రెండో వరసలో నిల్చున్న వాళ్ళలో మూడో మనిషిగా మాత్రం కావేఁ శానికి తన తండ్రని తెలుసు. 'నాన్నుంటే ఎలా వుండునో' కావేఁశం చాలాసార్లాలోచించాడు. 'అమ్మకి జుట్టుండును' అని తప్పిస్తే తనతండ్రి జీవించివుంటే కలిగే ఇతర మార్పులేవీ కావేఁ శానికి తట్టలేదు.

కావేఁశం చిన్నప్పుడే చెప్పేశాడు ఆచారిమేష్టారు 'వీడికీ జన్మలో ఒక్క మేథ మెటిక్కూరాదు' అని, కావేఁశానికి లెక్కల్తో పాటు చాలారాలేదు. అతనికి బాగా వచ్చేది హిస్టరీ, ఓ మోస్త రుగా వచ్చేది హిందీ. బళ్ళో అతన్ని చీవాట్లు పెట్టని మేష్టరు లేడు. ఆఖరికి డ్రాయింగు మేష్టరు కూడా కొట్టాడతన్ని ఓనాడు.

రెండంచీల మీద లేదనిపించాడు స్కూలు ఫైనలు తన యిరవై య్యొకటో యేట. పైకి చదివించడాని కతని తల్లికి శక్తి

లేకపోయింది, అతన్ని పెంచి పెద్ద చేసిం దతని తల్లి కామాక్షమ్మ. అతను పూర్తిగా పెరక్కుండానే తన ఆడబడుచు కూతుర్నిచ్చి పెళ్ళిచేసిందతనికి. అతని విధవప్పగారు రంగమ్మ కావేఁశంకంటె పెద్ద. చాలా పెద్ద. ఆవిడ మొగుడ్ని కావేఁశం ఎరగడు.

కొత్తబట్టలకోసం పల్లకీ ఎక్కాడు కావేఁశం. స్కూలు ఫైనలు పాసవగానే, కొత్తబట్టల్తో కాపురాని కొచ్చిన కామేశ్వరిని చూసి చాలా సంతోషించాడు. ఆనందం అతని హృదయంలో చిందులు తొక్కింది కొన్నాళ్ళు. ఆ తర్వాత కావేఁశ్వరి చిందులు తొక్కడం ప్రారంభించింది.

తన కాపురం గురించి అతని కేవో లీలగా తీయని ఊహ లుండేవి. ఆ ఊహలకి, తన కాపురానికి ఏమీ సంబంధం లేదని కావేఁశానికి వేగంగానే తేలిపోయింది. తొలిరోజుల్లో తన సాన్నిధ్యానికి సిగ్గుతో ముచ్చటపడే అతని భార్య తర్వాత్తర్వాత ముచ్చట పడ్డం మానేసింది. ఆ తర్వాత అతనంటే సిగ్గుపడ్డం కూడా మానేసింది.

కావేఁశానికీ, అతని భార్యకీ పేర్లు తప్ప యింకేవీ కలుప లేదు. వాళ్ళ ఆశయాలూ, అభిమతాలూ, అభిప్రాయాలూ అన్నీ వ్యతిరేకమే చల్లని వెన్నెల కొబ్బరి చెట్లను తడువుతూంటే, వెన్నె లకు తడిసి మెరిసే కొబ్బరాకుల్ని తనూ తన భర్తా చేయీ చేయీ పట్టుకొని డాబా మీద కూర్చుని చూడాలని కావేఁశ్వరి అభిలాష. చంద్రుడుండగాగాని, సూర్యుడుండగా గాని తన భార్య చెయ్యి తాను పట్టుకున్న పాపాన పోలేదు కాని, చంద్రుడూ సూర్యుడూ బెడ్‌లైటూ లేనప్పుడూ తన చెయ్యి మాత్రం తన భార్యని పట్టుకోనిచ్చే వాడు కావేఁశం. సాయంత్రం చల్లగాల్లో తనూ, తన భర్తా ఏ కాలవొడ్డునో, సముద్రపొడ్డునో మనుషులకి దూరంగా, దేవతలకి దగ్గరగా చెట్టా పట్టా లేసుకొని తిరగాలని కావేఁశ్వరి కోరిక. శివాలయానికీ, అస్పత్రికీ తప్ప భార్యా భర్తలు కలిసి యింకెక్కడికి వెళ్ళకూడదని కావేఁశం అభిప్రాయం.

కావేఁశం గదిలో వుండగానే తాను జాకెట్టు మార్చు కొంటు నప్పుడు కావేఁశం కొంటెగా తనవేపు చూస్తే "ఏమిటండీ ఆ చూపు" అని విలాసంగా కావేఁశం మోహాన్ని ఎడంచేత్తొ వెనక్కి తోసి, తాను కుడివేపు ఎర్రగా సిగ్గుతో వాలిపోవాలని కావేఁ శ్వరి కాంక్ష. అంచేత కావేఁశం గదిలో వున్నప్పుడు చాలా సార్లు జాకెట్టు మార్చుకుంది, మార్చుకోవాల్సిన అవసరం లేక పోయినా. అ సమయాల్లో ద్వారం దగ్గరగా వుండి తెరచివుంటే కావేఁశం బైటికి గెంతేసేవాడు. లేదా ద్వారం కావేఁశ్వరికి దగ్గ రుండి మూసివుంటే, బుద్ధిగా రెండోవేపు తిరిగి పోయేవాడు.

ఆ రోజు మంగళవారం. కావేఁశం అమ్మా, అక్కా గుడి కెళ్ళేరు. కామేశ్వరీ కావేఁశం ఒంటరిగా యింట్లో ఉన్నారు. అలా వుండటం అదే ప్రథమం. కావేఁశ్వరి ఊహలకి రెక్క లొచ్చేయి. ఏదో అర్థం కాని వింత ఆనందం ఆమెని వశంచేసు కుంది. ఆశ గాలికి తెరచాపలా పొంగింది. వీధి తలుపేసేసి "తలంటి పోసుకుంటారా?" అంది నవ్వుతూ కావేఁశంతో, తర్వాత 'పోయమంటారా?' అనడుగు దామని మంగళవారం నాడు అభ్యంగన ఫలం మృత్యువు అని తెలిసిన కావేఁశం "వద్దు" అనేశాడు.

ఎక్కడో ఒక తీగ తెగింది. విచ్చే మొగ్గది ఒక రేకు రాలి పోయింది.

కావేఁశం స్నానం అయ్యేక కావేఁశ్వరి వెళ్ళింది స్నానానికి. చాలా చన్నీళ్ళు తొరువుకుంది. మూడు పక్కలే గోడలున్నాయి వాళ్ళ బాత్‌రూమ్‌కి. ఆకాశమే పైకప్పు, వేరే ద్వారం పెట్టనక్కర్లే కుండా దానికి నాలుగో గోడ పెట్టడమే మానేశారు. ఆ గోడలేని వేపు వెళ్తే బాత్ రూమంతా కనిపిస్తుంది. వెళ్ళడానికి యిటికలు పాతిన తోవకూడా వుంది. స్నానం రమారమి అయేవరకూ కావేఁశ్వరికి మానభంగం కాలేదు. ఆవిడే పిల్చింది: "ఏవం డోయ్! ఆరేసిన చీరగదిలో దండేన్నుంది. కాస్త యిలా పడేస్తారా బాబ్బాబూ" అని.

బాబ్బాబు చీర దండెంమీద నుండి తీసేడు. 'అయినా యీ కావేఁశ్వరి కింత మందమతితనం పెరిగి పోతోందే మిటి చెప్మా రోజురోజూ' అనుకుంటూ చీరని బాత్ రూమ్‌లోకి ఎలా పంపించడమా అన్న సందేహం రాలేదతనికి. చీరని ఉండలా చుట్టేడు. పెద్దసైజు బంతి అంత అయింది. దాన్ని పదిలంగా పట్టుకుని బాత్‌రూం గోడ దగ్గరకెళ్ళి "పట్టుకో" అని దాన్ని బాత్ రూంలోకి విసిరేశాడు ఏ మాత్రం చాకచక్యం వున్నా కామేశ్వరి దాన్ని పట్టుకుంటుందని అతని ఊహ. చీర ఏవైపు నుండి ఎలా వస్తుందో తెలుసుకోలేని కామేశ్వరి చీరని పట్టుకో లేక పోయింది. చీర నేలనిపడిపోయి బురదంతా పట్టించుకుంది.

చాలా తీగెలు పటపట తెగిపోయేయి. ఎక్కడో ఒక మొగ్గ తన రేకులన్నీ రాల్చేసుకుంది. తన చీరతోపాటు ఆశలుకూడా బురదపాలై నట్టినిపించింది. కావేఁశ్వరికి.

రోజులు నలిగి దొర్లిపోతున్నాయి. కావేంశంగారిది చిన్నిల్ల యినా యిల్లంతా డాబా. డాబా. డాబా మీదున్న చిన్నగదే కావేంశం బెడ్‌రూం. ఆ యింటికి ఒక పక్క విశ్వనాథం యిల్లు; రెండోపక్క యింట్లో రెవిన్యూ యినస్పెక్టరు నాయుడు, తల్లి లేని తన యిద్దరు పిల్లల్తోటి కావేంశ్వరి కాపరానికి రాక పూర్వం నుండి అద్దెకుంటున్నాడు. నలభై ఏళ్ళు దాటుండవు అతనికి. భార్య లేకుండా కేవలం వంటమనిషి సాయంతో తన బిడ్డల్ని పాపం అతను ఎలా పెంచగల్గుతున్నాడా అని కావేంశం చాలా సార్లు సానుభూతితో ఆలోచించాడు.

కావేంశ్వరి కాపురాని కొచ్చిన సంవత్సరానికే నాయుడు మంచి వాడుకాదనీ, అతను తనవేపు అదోలా చూస్తాడనీ కావేం శంతో రహస్యంగ మొర పెట్టుకుంది. ఎంత వద్దన్నా వినకుండా నాయుడింటివేపున్న కిటికి తలుపులు మూయించేసింది. నాయుడు మంచివాడనీ. అతన్ని తను చాలా రోజులనుండీ చూస్తున్నాననీ కావేంశం ఎంత నచ్చజెప్పినా ఆవిడకి నచ్చలేదు.

ఆ సంవత్సరం ఫిబ్రవరిల్లోనే ప్రాంభించింది కావేంశ్వరి ఆరు బయట పడుకుందామన్న మారాం. చన్నీళ్ళ స్నానంలో నమ్మక మున్నా, కావేంశానికి మంచులో పడుకోకూడదని నమ్మకం. మంచులో పడుకుంటే పక్షవాతం వస్తుందని అతని చిన్నప్పు డెవరో అన్నారు. అంచేత అతను మే, జూన్లలో మాత్రం 15 రోజులు బైట పడుకుంటాడు.

కావేంశం 'బైట పడుకోవద్దు. జలుబు చేస్తుంది' అని సలహా యిచ్చేడు.

కావేంశ్వరి విన్లేదు.

'జబ్బు చేస్తుంది' నచ్చ చెప్పాడు.

కావేంశ్వరికి నచ్చలేదు.

'పక్షవాతం వస్తుంది' భయపెట్టేడు.

భయపళ్ళేదు కావేంశ్వరి.

'అయితే నీఖర్మ. సువ్వాకత్తెవూ పడుకో' అని శపించాడు.

ఆ శాపాన్ని వరంలా అంగీకరించిం దావిడ. ఉన్న ఒక్క మంచాన్ని పరువునీ విడదీశారు. పరువు కావేంశం వాటా కొచ్చింది. మంచమే చాలనుకుంది కావేంశ్వరి.

హాయిగా నేల్ని పరువు వేసుకొని గదిలో పడుకునే వాడు కావేంశం.

'చలిగాలి కిందా మీదా కొడుతూ వట్టి మంచంమీ దేమిటా హాయి ఆ పిల్లకి' అని విస్తుపోయ్యేవాడు.

ఆ హాయి ఏమిటో ఆమె చెప్పలేదు కాని ఆవిడ కేదో హాయి వున్నట్టే అతని కనుమానం వచ్చింది. మూడ్రో జుల్లో ముక్కు పట్టేసి గదిలోకి పక్కమార్చుదా' అనుకున్నాడు మొదట్లో. కాని ఆమొముక్కు మూడువారాలైనా మూసుకు పోలేదు సరికదా, రోజులు జరుగుతున్న కొద్దీ మెరవడం మొదలెట్టింది, మిగతా మొహంతోపాటు 'మంచు యీ పిల్లకి బాగా పడిందది' అనుకు న్నాడు కామేశం.

మంచు కామేశ్వరికి బాగా పడింది. చల్లగాలికి పొద్దెక్కే వరకూ నిద్ర పట్టేసేది. మనిషికి నడకలో చురుకూ, మొహంలో మెరుపూ. బుగ్గల్లో ఎరుపూ వచ్చేయి నెల తిరక్కుండా. మొహంలో నిండుతనం, మనిషిలో పరిపూర్ణత వచ్చేయి రెణ్ణెళ్ళకే.

భార్యలో వచ్చిన యీ అందమైన మార్పులకి సంతోషిం చిన కావేంశానికి ఆమెలోని యితర మార్పులు నచ్చలేదు. ఆ మార్పుల్లో ముఖ్యమైంది ఆమె చూపులో వచ్చింది. పరధ్యానంగా కళ్ళు కలలుకనే వప్పుడప్పుడు. మరొకప్పుడు చూపుల్లో బెదురు, భయం వ్యక్తమై కనురెప్పలు భయం భయంగా కొట్టుకొనేవి.

ముఖ్యంగా కావేంశానికి నచ్చనివి ఆమె తన వేపు చూసే వైఖరి. ఆ చూపులో జాలి ఎక్కువగా కనిపించే దతనికి. దెబ్బతిన్న పిల్లిపిల్ల వేపు, గజ్జిపట్టిన బొచ్చుకుక్క పిల్లవేపు మనుషులు చూసే చూపది. ఇప్పుడు తనకేం తక్కువని జాలిగా చూస్తుందను కొనేవాడు.

కాని ఆ చూపు అతన్నెక్కువ కాలం బాధ పెట్టలేదు. అలా చూడ్డం మొదలు పెట్టిన నాల్నెల్లకే పక్కింటి రెవిన్యూ యినస్పెక్ట రుకి ట్రాన్సఫరై మరోవూరు వెళ్ళి పోవడం, అతన్తో పాటు కావేంశ్వరికూడా వెళ్ళిపోవడం జరిగేయి.

'అవ్వ ! ఎంత సిగ్గుమాలినపని. తక్కువ కులం వాడితోనా' అని నోరు నొక్కుకుంది కావేంశం అక్క.

అది విన్న ఎదురింటావిడ 'నీకు మల్లే అందరికీ స్వశాఖ వాళ్ళే కుదుర్తారా!' అని మనసులో అనుకొని "ఔను, ఎంత సిగ్గుచేటు" అని బైటకు నోరు నొక్కుకుంది. "కాపరాని కొచ్చిన మూడేళ్ళకే యింతపనా?" అంది బెంగగా కామేశం తల్లి – కాపరానికి మూడేళ్ళు పూర్తయితే ఏ పన్చేసినా ఫర్వాలేదన్నట్టు

ఆఫీసరు గదిలోకి టపా పట్టుకెళ్ళిన వీరయ్య, టపా ఆఫీసరు గారి బల్లమీద పెట్టి తన నడకలో తొందర కన్పించ నీకుండా బైటపడ్డాడు. ఆవేళ ఏదో ప్రళయం బద్దలవుతుందని అందరికీ తెలుసు, టపాలో పై అధికారినుండి ఆఫీసరుగారికి వచ్చిన డి.ఓ. ఒకటుంది.

ప్రళయం రాకపోయినా, ప్రళయం వచ్చినంతశబ్దంతో మోగింది ఆఫీసరుగారి గదిలోని కాలింగుబెల్లు. సర్వేశ్వరుడ్ని తల్చుకుంటూ పైకప్పువేపు చూస్తూ నిలబడిన వీరయ్యకి పైకప్పులో సాలెపురుగు రూపంలో తప్ప సర్వేశ్వరుడు కన్పించలేదు. కాని గదిలోని ఆఫీసరు రూపంలోవున్న యముడు గుర్తుకొచ్చేడు. యముడు దగ్గరికి వెళ్ళినట్లే అయిష్టంగా వెళ్ళేడు గదిలోకి, నెత్తిన తలపాగా బోర్లించుకుంటూ.

'హెడ్ గుమాస్తాని పంపించు' అన్న ఆఫీసరు అరువు ఆఫీసంతా వినిపించింది. ఏనుగనిలోపలికి పంపుమన్న సింహం ఆహ్వానం అది. కాని హెడ్ గుమాస్తా విశ్వ నాథాన్ని ఎరుగున్న వాళ్ళెవరకీ ఏనుగ జ్ఞాపకం రాదు. అతను గుర్తుకొచ్చినప్పుడు. వాళ్ళకి నక్కలాటి చిన్నసైజు తెలివైన జంతువులే గుర్తుకొస్తాయి.

'ఏవిఁటీ వైధవ్యత్తరం, అంటూ విశ్వనాథం మొహం మీదికి విసిరికొట్టాడాఫీసరు తన టేబిలుమీదున్న డి.ఒ. తీసి. విశ్వనాథం నాన్ని తీసుకొని చదివి నవ్వేడు, ఏడవ లేక.

ఆపీసరు గొంతు ఆఫీసంతా వినిపించదన్న భయం లేకపోయినా, హెడ్ గుమాస్తాకి వ్యతిరేక శక్తులు రెండు తమ టేబిలువదిలి ఆఫీసరు గదివేపు నడుస్తూ 'వేరీజ్ దట్ ఇనెఫిషెంట్ ఫూల్ కావేఁశం?' అన్న ఆఫీసరు కేకకి అదిరిపడి మళ్ళాతము టేబిలువేపు వెళ్ళిపోయేయి.

"అతనికి రాత్రినుండి జ్వరంగావుంది సార్. ఊళ్ళో అమ్మవారుందని నేనే ఆఫీసుకి రావద్దన్నాను. డిస్పాచ్ నెంబరు చూసి చెప్తాను సార్ దీని విషయం" అన్నాడు విశ్వనాథం.

అమ్మవారి ఊసెత్తేసరికి ఆఫీసరు నోటికి తాళం పడిపోయింది. యాభయ్యో పడిలో పడినా, అతనికి తన అందం మీద, పర్సనాలిటీ మీద చాలా నమ్మక ముంది. అమ్మవారొస్తే అందం హరించి పోతుందని అతనికి మహాభయం. అమ్మవారి గురించాలోచిస్తూ ఆఫీసరు మాట్లాడక పోవడం చూసి బైటికి జారుకున్నాడు విశ్వనాథం.

❖ ❖ ❖

ఆఫీసుకొస్తూ ఆఫీసు నందు మలుపు తిరిగిన కావేఁశానికి వీరయ్య రొప్పుతూ తనకోసం పరిగెత్తడం ఆశ్చర్యం కలిగించింది. 'ఎడ్‌గుమాస్తాగోరు తవఁర్ని రెండ్రోజులు జరఁవని శలవెట్టి యింటి కాడే కూకో మన్నారు. బైటకి రావద్దన్నారు' అని వీరయ్య చెప్పిన మాటలకి మూర్ఛొచ్చినంత పనయింది.

కామేశం తన తండ్రి తద్దినంనాడు తప్ప యింకె ప్పుడు శలవు పెట్టినా హెడ్ గుమస్తా వప్పుకోడు. భగవంతుని లీల అర్థం కాని కామేశం హెడ్ గుమాస్తా లీలగకూడా అర్థం చేసుకుందుకు ప్రయత్నించలేదు. కాని అతని సలహా ప్రకారం యింటికెళ్లిపోయాడు– అయాచితంగా వచ్చిన శలవు, ఇల్లు కదలకుండా యెలా గడపడమా అని ఆలోచిస్తూ,

❖ ❖ ❖

గుమాస్తాగా జీవితం ఆరంభించిన ఆఫీసరు తన తెలివి తేలటవల్లా, చాకచక్యంవల్లా, మీదికెళ్ళి ఆఫీసరయ్యాడు. పనిలో నాన్పుడంటే అతను సహించ లేదు, త్వరగా నిర్ణయాలకి రావటం అతని ప్రత్యేకత. ఆ నిర్ణయాలు చాలాభాగం రైటవడం భగవదనుగ్రహం. దూరాభారాన ఎమ్.బి.బి.యస్. చదువుతున్న పెద్ద కొడుక్కి త్వరలో పెళ్లిచేసి పెద్దకట్నం పుచ్చుకుందామని అతని ఆశ. ఆ ఆశ ఫలించేటట్టు ప్రయత్నాలు చేశాలు. అందులో వొక ప్రయత్నంలో పాతిక వేలు చూచాయగా కన్పించాయి. ఆ సంబంధం ఖాయం చేసుకుందా మనుకొని, కొడుక్కి ముందుగా చెప్పడం మంచిదని అతనికి ఉత్తరం రాశాడు.

కొడుక్కి కూడా తండ్రిపోల్కే–త్వరగా నిర్ణయాలకి రావడంలో. తన వివాహం విషయమై తనకి స్వంత అభిప్రాయాలున్నట్టు అతను జవాబు రాశాడు.

ఆఫీసులోనే అందింది ఆఫీసరుగారి కొడుకు జవాబు: జవాబుకి జవాబు వెంటనే తీసి రాశేశాడాయన.

మైడియర్ సత్యనారాయణా!

ఇటుపైని యిలాంటి వెధవుత్తరాలు రాయొద్దు. నా పట్ల నువ్వు చూపవలసిన గౌరవం చూపలేకపోతే, ఈ నెల నుండీ కానీ కూడా నానుండి ఆశించవద్దు.

యుపర్స్ సిన్సియర్లీ

అని సంతకం చేసి, కాయితాలమీద తన సంతకాలకై వచ్చిన కావేఁశానికి ఆ ఉత్తరం. కొడుకు ఎడ్రసు ఇచ్చి పోస్టు చెయ్యమన్నాడు.

అదే టపాలో పై అధికారికి ఏదో స్టేట్‌మెంటు పంపాలి. అది ఆలశ్యమైందని అంతకు ముందురోజే ధుమధుమ లాడుతూ ఉత్తరం రాశాడు.

కావేంశం తన విధి తప్పకుండా స్టేట్‌మెంటూ, ఆఫీ సరుగారి కొడుకు గారి ఉత్తరం డిస్పాచ్ చేశాడు. కాని ఆ డిస్పాచ్ చెయ్యడంలో ఒక కవర్లో పెట్టవలసిన ఉత్తరం మరో కవర్లో పెట్టాడు. అతని సాధారణమైన పొరపాటు, అసాధారణమైన పరిణామాలకు దారి తీసింది. పై అధికారి పేరూ సత్యనారాయణే అవడంవల్ల – అతను నిప్పులాంటి మనిషి. లంచం అంటే రోత, ఆఫీసరు కొడుక్కి రాసిన ఉత్తరం చదువుకున్నాడు. తన కళ్ళని తానే నమ్మలేక మళ్ళీ చదివాడు. "ఏమిటి వీడి ఉద్దేశం! నెల్నెలా నాకు డబ్బు పంపిస్తున్నాడవా, వీడు వీడిపట్ల నేను చూపించాల్సిన గౌరవం చూపించక పోతే వీడు డబ్బు పంపడం మానేస్తాడా?" అనుకున్నాడు. అనుకున్నాక ఆలస్యం చెయ్యకుండా ఆ ఆలోచనల్నే కాగితం మీద పెట్టి డి.ఐ. కింద పంపించేశేడు క్రింది ఆఫీసర్‌కి. ఆ.డి.ఒ. మూలంగానే అక్కర్లేని శలవను భవిస్తున్నాడు కావేంశం.

ఆ సాయంత్రం టపాలో ఆఫీసరుగారికి తన కొడుకు దగ్గర్నుంచి ఒక ఉత్తరం వచ్చింది. అందులో ఆఫీసు స్టేట్‌మెంటుంది. దాంతో ఆఫీసరుగారికి డి.ఒ. అర్థం అయిపోయింది. వెంటనే హెడ్ గుమాస్తాను పిల్చి కామేశాన్ని డిస్మిస్ చేశేమన్నాడు. దాని కేం భాగ్యం "శలవునుండి రానీండి, అలాగే చేసేద్దాం" అని హెడ్ గుమాస్తా తాత్కాలికంగా చక్రం అడ్డువేశాడు.

❖ ❖ ❖

హెడ్ గుమాస్తా విశ్వనాథాన్ది కామేశం యింటి పక్కిల్లు. భార్యలేకుండా గడుపుకోలేని వయసులో, రెండో పెళ్ళికి తయారవలేని వయసులో అతనికి భార్యావియోగం కలిగినది. అప్పటికి అతనికి 14 ఏళ్ళ పెద్ద కూతురు కాక, మరో ముగ్గురు సంతానం వున్నారు. ప్రపంచం గుట్టెరిగిన జ్ఞాని అతను. అభానికీ శుభానికీ కామేశం తల్లిచేత వంట చేయించుకుంటూ, కావేంశం కుటుంబంవల్ల తనకు వీలైన అవసరాలు గడుపుకుంటూ, వాళ్ళక్కూడా తను యథాశక్తి సాయపడుతూ వుండేవాడు అతనికీ, కావేంశం అక్కకీ ఏదో వుందని ప్రపంచం వేసిన నిందలో నిజానిజాలు ఎలా వున్నా, కావేంశానికి తన ఆఫీసులో టెంపరరీ గుమస్తాగా వేయించింది అతనే.

కావేంశం మూడుసార్లు సర్వీసు కమిషనుకి కట్టినా లాభం లేకపోయింది. సర్వీసు కమిషను తప్పి, యిప్పటి కారేళ్ళ క్రిందట, కానీ ముట్టని, ఎవరికీ అక్కర్లేని రిసీవ్ అండ్ డిస్పాచ్ సెక్షన్లో ప్రవేశించాడు కావేంశం. అందులో ప్రవేశించిన వాళ్ళంతా ఆర్నెల్లు దాటకుండా యితర సీటల్లోకి దాటేస్తారు. ఆ రేళ్ళయినా కావేంశం దాన్ని వదలకపోవడానికి కారణాలు రెండు. ఆ ఆఫీసులో అంతకన్న తక్కువ సీటు లేక పోవడం మొదటిది. విశ్వనాథం, కావేంశం డిస్మిస్ కాకుండా కాపాడుతూ వుండటం రెండోది.

ఆఫీసులోని మిగతా గుమాస్తాలూ జవాన్లూ మొదట్లో మామూలుగానే గౌరవించారు కావేంశాన్ని, కాని కొద్ది నెలల్లోనే అతను ఆఫీసుకి వస్తూంటే జవాన్లు నిలబడ్డం మానేశారు. మొదట్లో అతన్ని చూసి అదుర్దాగా కాలుస్తున్న బీడి పారేసే జవాన్లు, తర్వాత్తర్వాత అదికూడా మానేయడం జరిగింది. కానీ దానికి ఎంతమాత్రం విచారించలేదు కావేంశం.

అతనికి జవాన్లంటేనే చికాకు. ఏ పనీ చేతకాని వాడిని భగవంతుడు జవానుగా పుట్టిస్తాడని అతన్న మ్మకం. అసలు వాళ్ళకి కవర్లుకూడా సమంగా అంటించడం రాదు ఇన్ని కవర్లూ మరో యిన్ని సర్వీసు పోస్టేజి స్టాంపులు, ఏ కవరు మీద ఎన్ని స్టాంపులు అంటించాలో మూడుసార్లు చెప్పి యిచ్చినా ఒక్క జవానూ సరిగా అంటించడు. అంచేత తానుద్యోగంలో ప్రవేశించిన కొద్దిరోజులకే జవాన్ల చేత ఆ పని చేయించడం మానేశాడు కావేంశం. అతనే మూతి విరిగిన సిరాబుడ్డిలో వున్న తుమ్మ బంక తడుపుకొని సిరస్తాగా కవర్లు అంటించి, వాటికి కుడివైపు మీది భాగంలో కావలసినన్ని స్టాంపులు వరసగా ఒకదాని ప్రక్క నొకటి అటించేసుకుంటె, జీవితంలో ఏదో గొప్ప ఘన కార్యం సాధించినట్టుండేది ఆపనే జవాన్లచేత చేయిస్తే వాళ్ళు కొన్ని స్టాంపులు సమంగానూ, మరికొన్ని తల క్రిందులుగానూ అంటించేవారు. ఛీ! ఛీ!! అసహ్యం. కవరూ. ఎడ్రసూ, స్టాంపులూ చూడగానే చిరునామాదారు ఆకర్షింపబడాలి. తాను డిస్పాచ్ చేసిన ఉత్తరం బొచ్చెడు ఉత్తరాల్లో చిరునామాదారుని ఆకర్షించాలనేది కావేంశం డిస్పాచ్ చేసిన ఉత్తరాన్నే ఎంత నీట్‌గా వుందో, అనుకుంటూ – అసలు కావేంశాన్ది ముత్యాల కోవలాటి దస్తూరీ– మొట్టమొదట చదువు కోవాలనీ కావేంశం ఆశ.

ఆ ఆశయం ఫలించిందో లేదో తెలియదుకాని, అతని మరో ఆశయం మాత్రం ఫలించింది, జవాన్ల మీద అతను ఆధార

పడినన్నాళ్ళు సగటున నెలకి కావేఁశం ఆఫీసునుండి ఉత్తరాలు వెళ్ళిన యితర ఆఫీసులు కవర్లమీద తక్కువ పోస్టేజి అంటించ డంవల్ల తాము పెనాల్టీ డబ్బులు గవర్నమెంటు వారు కావేఁశం దగ్గర్నుంచే వసూలుచేయడం జరిగేది. డబ్బులు పోతున్నా యని కావేఁశం విచారించలేదు కాని యింత చేతకాని జవాన్లు సంసారాలు ఎలా నడుపుకుంటారా అని బాధపడేవాడు. కవర్లు తానే అంటించడం ప్రారంభించేక సగటున నెలకి ఒక్కసారి మాత్రం పెనాల్టీ కట్టుకోవలసి వచ్చేది కావేఁశానికి. ఈ అభినం దించాలన్న కావేఁశం వాంఛ అతని తీరని కోరికల్లో ఒకటి.

అతని ఆఫీసుకి చాలినన్ని కవర్లు సప్లయి అయేవికావు. అందువల్ల తీరికసమయం అంటూ వుంటే, ఆ సమయంలో కావేఁశం తన ఆఫీసుకి వచ్చిన పెద్ద కవర్లన్నీ చించి, వాటి వాటి లోపలిభాగం పైకి వచ్చేలా మడత పెట్టి, చిన్న కవర్లు కట్టి అవి వాడేవాడు. అవి చూడ్డానికి కొత్త కవర్లలా ముద్దొస్తూ వుండేవి. అసలు యింతకుముందు ఆఫీసరు తన ఫేర్‌వెల్ పార్టీలో గుమస్తా లందరివద్దా శలవు తీసుకుంటున్నప్పుడు కావేశం దగ్గరికివచ్చినవ్వుతూ "కవర్లుకట్టడంలోమన కావేఁవం ఫస్టు" అని బహిరంగంగానే అభినందించడం, కావేఁశం ఆ రోజు రోడ్డుమీద కాకుండా గాల్లోనడిచి యిల్లు చేరడం జరిగాయి.

కావేఁశం ఆశయాల్లేనివాడవడానికి వీల్లేదు. అతని ముఖ్య లక్ష్యం లంచం పుచ్చుకోకూడదని. అది ఫలించడానికి ప్రపంచం అంతా అతనికి సహాయం చేసింది. అవనికి యెటువంటి లంచం ఎవరూ యిస్తామన్లేదు, ఒక్కనాడుతప్ప

ఒకనాటి రాత్రి కావేఁశం భోజనానికి కూర్చోబోతూ ఉంటే ఎవడో వీధి తలుపు తట్టేడు. పట్టుపంచతో ఉన్నా కావేఁశమే స్వయంగా తలుపు తెరచి ఆ వచ్చిన సిల్కు బట్టల, బట్టతల పెద్దమనిషిని గదిలోఉన్న ఒక్క కూర్చీలోనూ కూర్చోమని తాను నిలబడ్డాడు. అతని బట్టతలతో నిండైన ఎర్రటి విగ్రహం. నెరసీ నెరవని సన్నని మీసం. కళ్ళద్దాల వెనక మెరిసేకళ్ళూ చూస్తే కావేఁశానికి అతన్నెక్కడో చూసినట్టనిపించింది. ఆ వచ్చిన ఆసామీకూడా నీళ్ళునములకుండా చిరు నవ్వుతో "తమరు నిలబడుంటే నేను కూర్చోడమా! ఎంత మాటెంతమాటా! తమరు కూర్చోండి" అంటూ భుజాలు పట్టుకొని కావేఁశాన్ని కుర్చీలో కూర్చుపెట్టేసి తానే నిల బడ్డాడు. "ఎంతమర్యాదెంతమర్యాదా?" అని ఆశ్చర్య పడ్డాడు కావేఁశం.

"తఁవరు నన్ను రక్షిస్తారని అభయం ఇవ్వాలి. లేక పోతే నేను మిమ్మల్ని వదలను" అన్నాడా పెద్దమనిషి కావేఁశాన్ని పట్టుకోకుండానే.

"చెప్పం డేం కావాలి?" అన్నాడు కావేఁశం. నిజాని కతను ఏం కావాలన్నా ఇచ్చెయ్యాలనుం దతని మర్యాద చూశాక.

"అంత పెద్ద పనేం కాదు. ఈవేళ మీ ఆఫీసులో సంతకం అయిన బిల్డింగు కంప్లీషను రిపోర్టు త్వరగా డిస్పాచ్ అయ్యేట్లు చూడాలి అంతే. అది వెళ్తేగాని నాకు రావలసిన డబ్బునాకు రాదు తవఁరా రిపోర్టు రేపు డిస్పాచి చేస్తిరా తవఁమేలు జన్మలో మర్చిపోను" అన్నాడా పెద్దమనిషి నమస్కరిస్తూ.

అతని కోరిక చిన్నది, న్యాయసమ్మతమైనది. దాన్ని అను గ్రహించడంలో కావేఁశం వింత ఆనందం పొందాడు. "తప్ప కుండా" అన్నాడు బైటికి.

"థేంక్యూసర్. థేంక్యూ వెరీమచ్" అంటూ జేబులోంచి పదిరూపాయలనోటు తీసి, కామేశం వద్దనేలోగానే అతని చేతిలో పెట్టి "ఏదో యథాశక్తి" అని ఆకర్షణీయంగా నవ్వాడా పెద్ద మనిషి. అతని నవ్వులోని ఆకర్షణ చూసే పరిస్థితిలోలేడు కామేశం.అతనిచూపు ఒక్కసారి తగ్గిపోయింది. ఊపిరి బిగుసుకు పోయింది. పళ్ళు అకస్మాత్తుగా వేడెక్కి పోయింది. కిటికీ అవతల చీకట్లో పోలీసులూ, యమభటులూ ఒకర్నొకరుతో నేసుకుంటూ గదిలోకి ఆత్రంగా చూస్తున్నట్టవి పించిందతనికి. వంట్లో శక్తంతా ఒక్కసారి ఉడికి పోయింది. ఆకస్మాత్తుగా జరుగుతున్న వర్తమానం గురించి ఆలోచించడం మానేసిన అతని మనసుకి భవిష్యత్తు అగాధమైన సమస్య తెచ్చిపెట్టింది. ఈ బట్టతల మనిషి బైటకు వెళ్ళగా నేలోపలికి ఎవరొస్తారా, పక్కింటి హెడ్ గుమ స్తానా? పోలీసులా! ఆఫీసరా? అని ఆలోచించలేక మానేసి "అక్కర్లేదు" అంటూ నోటువున్న కుడిచెయ్యి ముందుకు చాస్తూ నిలబడబోయాడు కావేఁశం. కాళ్ళు అతని భారాన్ని మోపెట్టు లేవు. "మరేం తప్పలేదు బాబు, వుంచు చిన్నవాడివి. అంతా చేశేదే! నే వెళ్ళొస్తానా మాట మర్చిపోకు నాయనా" అంటూ కావేఁశాన్ని కుర్చీలో కూర్చోపెట్టేసి, బైటకు జారుకున్నాడు పెద్ద మనిషి, కామేశం నోరు తెరిచేలోగానే.

తెరచి ఉన్న తలుపువైపే హెడ్ గుమాస్తా, ఆఫీసరూ, పోలీ సులు ఉమ్మడి రాకకోసం చూస్తూ కుర్చీలోనే కూర్చుండి పోయాడు, కావేఁశం. అతనికున్న ఫీలింగల్లా భయం, ఆనందం,

విచారం వగైరా. ఫీలింగులు ఎప్పుడో అరుదుగా వచ్చేవి. చిన్నప్పట్నించీ తోటి మగపిల్లలంటే భయం, కొంచెం వయసొచ్చేక మొగపిల్లలన్నా అడపిల్లలన్నా ఒక్కలాటి భయమే. బడికి ఆలశ్యంగా వెళ్ళడానికి భయం, పాఠాలు చదవకపోతే భయం, అవి రావని : చదివితే భయం, అవి రావడం లేదని : బళ్ళోవున్నన్నాళ్ళూ పరీక్ష పోతుందనే భయం, పాసయితే యింకా పెద్ద క్లాసూ, పెద్ద పుస్తకాలూ చదవాలన్న భయం, స్కూలు ఫైనలు పాసయేక ఉద్యోగం దొరకదేమో నని భయం : దొరికేక అది ఊడుతుందేమోనని భయం.

ఈ భయాలకితోడు యిప్పుడో కొత్తభయం. అలా కుర్చీలో ఎంతసేపు కూర్చున్నాడో తెలీదుకాని 'వడ్డించే శా|స్రా కావుఁదూ' అన్న తల్లి కేకకి తెలివొచ్చిందతనికి. పరధ్యాన్నంగా రెండు మెతుకులు ఎంగిలిపడి విశ్వనాథం యింటికి పట్టు పంచెతోటే పరిగెట్టికెళ్ళి జరిగిందంతా అత్తన్తోచెప్పి యీ విపత్తునుంచెలాగయినా కాపాడమని అతని చేతిలో బట్టతల పెద్ద మనిషిచ్చిన నోటు పెట్టాడు కావేఁశం. విశ్వనాథం ఆప్యాయంగా 'యిలాంటి వెధనపన్లూసు కెప్పుడూ వెళ్ళకు నాయనా ఎప్పటికైనా నా అంతై నువ్వు హెడ్ గుమాస్తా కావాలని నా కోరిక. ఈ పదిరూపాయలూ పాప పరిహారార్థం ఏ దేవాలయానికో యిచ్చేస్తాన్లే. నువ్వు బెంగ పెట్టుకోకు' అంటూ భుజంమీద చెయ్యివేసి రోడ్డువరకూ కావేఁశాన్ని దిగబెట్టాడు.

ఆ ఆపదలనుండి అంత సుళువుగా బైటపడినందుకు కావేఁశానికి ఆ రాత్రి సగమే నిద్రపట్టేసింది.

కావేఁశానికి లంచం పుచ్చుకోకూడదని ఆశయవైఁతే, పాపులర్గా వుండాలని ఆశ. అతన్ని చూసి అంతా 'మన కామేశం వచ్చాడు' అంటే 'మన కవేఁశం వచ్చాడు' అని అనాలని. ఆపదలో వున్న వాళ్ళు 'కావేఁశం వొచ్చాడింక భయంలేదని' అనాలని అతని అభిలాష ఏదో తప్పుచేసి యినస్పెక్షన్లో దొరికిపోయిన హెడ్ గుమాస్తా 'బాబ్బాబు యీ గండంనుం డెలాగయినా తప్పించు' అని అతన్ని బతి మాలాలని కావేఁశం కోరిక. ఈ కోరికలు కోరికలుగానే వుండి పోయాయి.

'కావేఁశానికి ఆదర్శం ఫలిచకపోయినా ఆఫీసులో ఆదర్శ ప్రాయుడైన పురుషుడు కనిపించాడు జార్జిలో. జార్జిని చూసిన వాళ్ళెవరూ అతను లోయర్ డివిజను గుమాస్తా అనుకోరు. అతన్ని చూస్తే కొత్తగా పెళ్ళయిన డాక్టరో, ఇంజనీరో అనుకుంటారెవరైనా. పిత్రీయంఁలేదతనికి, కాని నల్లగా బలంగావుండే అతను నిత్యం టెర్లిన్ బట్టల్లో మెరిసి పోతుంటాడు. మధ్యగా చీల్చినున్నగా పైకి దువ్విన నల్లటి జుత్తు. ఆరోగ్యంతో మెరిసే మొరక కళ్ళూ. బలమైన కనుబొమ్మలూ, తిన్నని ముక్కూ అతని ప్రత్యేకాకర్షణలు. ఎంత అపరిచితుడైనా అతన్ని చూడగానే బలం, యుక్తి అతని సొత్తనిపిస్తుంది.

జార్జి నెవరూ ఆఫీసులో ప్రశ్నలు వేయరు. అతని కెదురు జవాబులు చెప్పరు. అతను ఆఫీసుకి తీరుబడయినప్పుడు వస్తాడు, తీరుబడిలేనప్పుడు వెళ్ళిపోతాడు. అతనిమీ దెప్పుడైనా ఆఫీసరుగాని, హెడ్ గుమాస్తాగ్గానీ కోపంవస్తే, ఆకోపం కావేఁశం లాంటి వాళ్ళమీద చూపిం చేసి, అతన్తో నవ్వుతూ మాట్లాడుతారు.

జార్జి వస్తువులేవీ చౌకబారుని కావు. అతనివాచీ స్మగుల్డులో రూ. 300, వాడుకుందుకి పైలెట్ పెన్నూ, వాడనందుకి పార్కరు పెన్నూ ఒక జేబులోనూ, ఒక లెగ్ బైట పెట్టిన గాగుల్సు రెండో జేబులోనూ ఎప్పుడూ వుంటాయి. దసరా బుల్లోళ్ళా ముస్తాబు చేసిన రేలీసైకిల్ ఉందతనికి అతనికి రాని విద్యలేదు. స్కూటర్లేక పోయినా స్కూటరెక్కడ మొచ్చతనికి కారులేకపోయినా కారు నడప గలడు. మిషనరీదొర స్కూటరో కాంట్రాక్టరు కారో ఎక్కి ఎప్పుడూ తిరుగుతూ వుంటాడతను.

ఎవరినైనా అంత సుళువుగా అంచనా వెయ్యగల డతను. ఆఫీసుకొచ్చే మనుషుల్నతడు పలకరించడం లోనే తెలుస్తుందతని అంచనా. కొందర్ని చూసి కేవలం చిరునవ్వు నవ్వుతాడు, మరి కొందర్ని తన తలా: వాలు కళ్ళూ విలాసంగా దించి పలకరిస్తాడు. ఇంకొందరికి తనసీటు యిచ్చేసి కాఫీకూడా తెప్పిస్తాడు.

అతను ఆఫీసుకి రావడమే ఒక దుమారంలా వస్తాడు. 'ఏం వీరయ్యా ఏమిటి సమాచారం' అని కునికిపాట్లు పడుతున్న వీరయ్యని పలకరించి, హెడ్ గుమాస్తాకొక 'గుడ్ మార్నింగ్ సర్' పారేసి, 'ఏం జాన్కీ ! హౌ యీజ్ లైఫ్' అని జానకిని పలకరించి, 'హౌయీజ్ ఎవిరిబడీ!' అని మిగతా అందర్నీ ఒక్క చూపులో చుట్టిపారేసి ఉక్కిరి బిక్కిరి చేసేస్తాడు.

జార్జిలాటి వాళ్ళు ఆఫీసుకి చీడపురుగులని హెడ్ గుమాస్తా అవ్యక్త అభిప్రాయం. ఇలాంటివాడు ఒకడున్నా చాలు ఆఫీసుకి శోభ!' ఇదీ అవ్యక్త అభిప్రాయమే; జానకిది. జార్జి ఆఫీసులో వున్నంతసేపూ జానక్కి ఊపిరి సమంగా ఆడదు. 'కలకాలం

కావేశంతో" బ్రతికేకంటే జార్జిలానాల్రోజులు బ్రతికే చాలు .. యిది కావేశం అ ప్రకటిత అభిప్రాయం.

అక్కర్లేందే శలవు దొరికిన కావేశం, భార్య గురించి ఆలో చిస్తూవుంటే నల్లగా చీకటి అతన్ని, అతని గదినీ చుట్టేసింది. గదిలో యెవరూ లైటు వెలిగించడం లేదు. కింద వంట గిన్నెలు చప్పుడౌతున్నాయి. దూరంగా సినిమాపాట శ్రావ్యంగా విని పిస్తోంది. పాటాగిపోగానే 'ఎక్కడ చచ్చావ్ కావేశం' అన్న విశ్వనాథం కేక వినిపించింది కిందనుండి. భయంగా మెట్లు దిగాడు కామేశం.

క్రింది గదిలో ఎర్రటి హరికెన్ లాంతరు వెలుగులో ఎర్రగా మండిపోతూ పచార్లు చేస్తున్నాడు విశ్వనాథం. కావేశం అక్కడ నవ్వుతూ యెదురుగావున్నా, కావేశం గదిలోకెళ్ళి ఒగ పట్టిన గోడనానుకుని నేల్ని చూస్తూ నిలబడ్డాడు.

"ఇహ నా వల్లకాదు నాయనా నిన్ను కాపాడ్డం. నీ ఖర్మను బట్టి నువ్వుపో. నన్ను నిందించకు. ఈ శలవయి పోయాక ఆఫీసరు నిన్ను డిస్మిస్ చెయ్యడం ఖాయం" అని ఠకీమని కుర్చీలో కూర్చున్నాడు విశ్వనాథం.

'నేన్చేసిన తప్పేమిటి? నన్నెందుకు డిస్మిస్ చేస్తాడయన? దేన్నించి నవ్వు నన్ను కాపాడాలి?' అని కావేశం అనలేదు. తన మీదికి యేదో గండం దొర్లుకొస్తూనే వుంటుందని అతని గట్టి నమ్మకం. తనేదో ఘోరమయిన అఘాయిత్యం చేసేవుం టానని అతనిభయం. రంగులు మార్చుకోక పోయినా నేల్ని చూస్తూనే వున్నాడతను.

"అయినా ఉత్తరాలు పోస్టుచెయ్యడం రాకపోతే యింకెందు కయ్యా నువ్వు? ముస్టి రెండుత్తరాల్లో ఒక దాన్లో ఒకటి పెట్టి యింత కొంపముంచుతా వనుకోలేదు. నిన్నాఫీసుకి రాని య్యొద్దంటున్నా డాఫీసరు. మంచివాడు కాబట్టి ఇంటికొచ్చి తన్న లేదు సంతోషించు' అని కుర్చీలోంచి లేచిమళ్ళా పచారు ప్రారంభించాడు విశ్వనాథం.

కళ్ళల్లో ఊరుతున్ననీటిని కళ్ళతోనే వెనక్కి పీల్చడానికి ప్రయ త్నిస్తూ నేల్ని చూస్తూనే వున్నాడు కావేశం.

విశ్వనాథం వైపు చూడ్డం మాని కావేశంవైపు చూసింద తని అక్క, కడుపు తరుక్కుపోయిందావిడికి. ఆవిడే ప్రారంభిం చింది విశ్వనాథంతో సంభాషణ. ఆవిడే ఆరాతీసింది. ఆఫీసులో జరిగినదాని వివరాలు.

అన్ని వివరాలూ చెప్పాడు విశ్వనాథం, ఆఫీసరు కోపానికి తన వివరాలు కలుపుతూ, అన్నీ చెప్పాక 'ఇహ ఈ వేళ్ళించి మీ కర్మ మీది. నా ఖర్మ నాది' అంటూ తారాజువ్వలా వెళ్ళి పోయాడు

రాత్రి పదిన్నరైనా నిద్రరాలేదు కావేశానికి. తన తప్పు ఎంత చిన్నదైనా పెద్దగానే కనిపిస్తుందతనికి. విశ్వనాథం చెప్పినట్టు తన తప్పుకు ఆఫీసరు తనని తన్నినా తప్పు లేదు. తను మొదట్నుంచీ భయపడుతున్న పరిస్థితి రానే వచ్చింది. ఉన్న ఉద్యోగం కాస్తా ఊడేక చేసేదేం లేదు. రోజులు వెళ్ళడమే కష్టం. అమ్మ మళ్ళీ ఎవరింట్లోనో వంటకు కుదురుకోవాలి. అక్క నీళ్ళు మొయ్యాలి. వాళ్ళ రెక్కల మీద తినాధారపడాలి. తనకి ఏపనీ చేతకాదు. వ్యాపారం చెయ్యలేడు. దానికి యుక్తీ పెట్టుబడీ కావాలి. ప్రైవేటు చెప్తానన్నా తనదగ్గర యెవరూ చెప్పించుకోరు. అతని దృష్టిలో అతడు యెప్పుడూ హీనంగానే కన్పిస్తాడు. ఈనాడు మరీ అసహ్యం వచ్చింది తనమీద తనకి.

పదకొండైంది. నిద్ర రాలేదు. భవిష్యత్తులో నమ్మకం హరించి పోతోంది కర్పూరంలా. రాత్రిఅవుతున్న కొద్దీ తన వంటరితనమే తనను బాధిస్తోంది. భయపెడ్తోంది. మేకును తగిల్చిన చొక్కా, పేంటు తొడుక్కుని కాళ్ళు పీకేదాకా వీధులన్నీ తిరిగాడు. ఆఖరకు రైల్వేస్టేషనుకి తీసుకెళ్ళా యతని కాళ్ళు.

రైలుస్టేషను చేరే సరికి అర్ధరాత్రై చాలా సేపై పోయింది. మూడు గంటల పాసింజరు కోసం అక్కడా అక్కడా ప్లాటఫారం మీద శవాల్లా పడుకున్నారు కొంతమంది పాసింజర్లు. ఆ శవాన్ని చూసేసరికి ప్రాణం లేచివచ్చి నట్టయింది కావేశానికి. ఇంత సేపూ శ్మశానంలా నిర్జీవంగా వున్న వీధుల్లో తిరగడం వల్లొచ్చిన వొంటరితనం వదిలేసిందతన్ని.

ప్లాటుఫారంమీద చివర, చీకట్లో సిమ్మెంట్ బెంచీ మీద కూర్చున్నాడు కావేశం. వెల్తుర్లో పక్క బెంచీమీద ఎవరో ఒక తను కూర్చుని పకోడీలు తింటున్నాడు. అతని మిసాలు కృష్ణదేవ రాయల మీసాల్లా వున్నాయి. రెండు గుడ్సురైళ్ళు కట్టిపడేసిన పాముల్లా వొకదానిమీదొకటి బుసకొడుతున్నాయి. బద్ధకంగా నోట్లో బీడీ పెట్టుకుని వొక రైల్వే పోలీసు పచారు చేస్తున్నాడు. కుక్క కుక్కొక్కటి ఎంగిలాకు ఎత్తుకొచ్చి కూర్చుని 'నీ క్కావాలా' అన్నట్టు కామేశం వైపు చూసి 'నీ కివ్వను' అన్నట్టు పట్టుకొని పారిపోయింది. కృష్ణదేవరాయులు పకోడీలు తినేశాడు. ఆకు

పారేసి మంచినీళ్ళ కెళ్ళిపోయాడు. లేచి యింటికి బైల్దేరాడు కావేఁశం.

ఇంటికి బయల్దేరిన కావేఁశం బుక్‌స్టాలు దగ్గ రాగిపోయేడు, స్టాలువాడులేడు, టీకి కాబోలు పోయేడు. నిలబడి పుస్తకం చదువుతోందో దొరసాని. ఆమెకు గజం దూరంలో నిలబడ్డాడు కామేశం. ఆమె చేతిలోని పుస్తకం పై పేచూస్తూ దాని చివర అట్టమీద ఆడ బొమ్మని చూస్తే తనభార్య గుర్తొచ్చింది కావేఁశానికి. ఎక్కడుందో పాపం ! నాయుడు తంతున్నాడో ఏమిటో? పైకి ముంచివాళ్ళాగే వుండేవాడు నాయుడు. అలాంటి వాళ్ళే ఖూనీలు చేసేస్తారు.

దొరసాని చదువుతున్న పుస్తకాన్ని, "వాంటిట్" అని కావేఁశం చేతిలో పెట్టి నవ్వుతూ వెళ్ళిపోవడం, తనవేపు చూడకుండా స్టాలువాడు "ఒకటి అరవైకి" తక్కువ ఎంత అన్నా ఎవరికో టైము చెప్తున్నాడనుకొనేవాడు కావేఁశం కాని "ఒకటి డెబ్భైఐదు" అన్నవాడి మాట తన చేతిలోవున్న పుస్తకం ఖరీదే అని గ్రహించిన కావేఁశం, "పుస్తకం అక్కర్లేదు" అనలేక డబ్బిచ్చి బైటపడ్డాడు.

మర్నాడు బాగా పొద్దెక్కాక లేచేడు కావేఁశం. ఆవేళకూడా శలవే ఆఫీసరు ఆ గ్రహంవల్ల: పైగా యిల్లు కదలడానికిక్కూడా వీల్లేదు జ్వరమని శలవు పెట్టడం వల్ల. ఏం చెయ్యడానికి తోచక తాను కొన్న పుస్తకం తీశాడు "హౌటు గ్రో గ్రేట్ యిన్ థర్టీ డేస్" అన్న పుస్తకం అది. గొప్పవాళ్ళు యింకా గొప్పవాళ్ళవడానికీ. గొప్పలేని వాళ్ళుకూడా రమారమీ అంత గొప్పవాళ్ళవడానికీ మంత్రాలు మినహా అన్ని చిట్కాలూ వున్నాయి. చివర అట్ట మీద చాలా రాసివుంది ఆ పుస్తకం గురించి ఆ రచయిత గొప్ప వాళ్ళను చేయడానికి స్కూలు నడుపుతున్నాట్ట.

కామేశం ఆవేళ ఆ పుస్తకం చదివెయ్యదలుచుకున్నాడు. చదివేశాడు అతనికా పుస్తకం నచ్చింది. బాగా నచ్చింది. తనలో వున్న ఏ ఒక్క గుణం వుండట గొప్ప వాళ్ళకి. దాని ప్రకారం గొప్పవాళ్ళవడానికి ముందు సిగ్గు మానుకోవాలిట. ఎంత కొత్త వాడితోనైనా చొరవగా మాట్లాడెయ్యాలిట. పాతవాళ్ళతో మాట్లాడే ముందు నవ్వాలిట, నవ్విన తర్వాత అవతలవాణ్ణి గొప్ప వాడవదల్చుకున్నావాడు పొగడాలిట. పొగడ్త ఎక్కడ మొదలు పెట్టడమా అని సందేహం వున్నవాళ్ళకి కొన్ని టిప్పు వున్నాయి. అవతల మనిషి మొగాడైతే అతని తెలివినీ, గొప్పనీ, ఆడదైతే ఆమె అందాన్నీ పొగడాలిట. అవతల మనిషితో ఆ మనిషితో పిల్ల కూడా వుంటే, ఆ పిల్ల ఏమాత్రం బావున్నా ఆ పిల్ల అందాన్నీ, ఏవీఁబాగోకపోతే ఆ పిల్ల తెలివినీ స్తుతించాలట, పై వాళ్ళు ఎంత సాధారణమైన పనిచేసినా మెచ్చుకోవాలిట.

యితరులకి, ఎంత చిన్నవైనా ఫర్వాలేదు. ఉప కారాలు చేస్తూనే వుండాలిట.

ఇప్పుడర్థమైంది జార్జి పాపులారిటీకి కారణం కావేఁశానికి. అతను అందర్నీ పలకరిస్తాడు. ఆఫీసుకి వస్తు న్నప్పుడు. వీరయ్య నిద్రపోతూవుంటే లేపి మరీ పలక రిస్తాడు. అసలతను ప్రత్యేకం నవ్వక్కర్లేదు. అతని మొహమే నవ్వు మొహం. అందర్నీ పొగుడుతూనే వుంటాడు. "మీరు తల్చుకుంటే ఎంతసార్" అంటూ. మర్నాడునిద్రలేచింది కావేఁశం కాదు. కామేశ్వర్రావు లేస్తూనే తన ఎత్తు అంతా సాగేలా బద్ధకంగా ఒళ్ళు విరుచుకొని అద్దంలో చూసుకున్నాడు. అద్దంలో కనిపించింది. ఒక అపరచిత వ్యక్తి. అతని కళ్ళల్లోని ఎర్రజీర అలసటను కాకుండా, తనకి తనలో వుండే నమ్మకాన్ని సూచిస్తోంది. అతని కనుబొమ్మలూ. నుదురూ ముడు చుకు పోలేదు. భగవంతుడు పెట్టినచోటే వున్నాయి. కావేఁశం మామూలుగా పెట్టే ముళ్ళూ ముడుతలూ లేవు వాట్లో. ఈ మార్పులుమంచి ప్రోత్సాహమిచ్చేయి కామేశానికి.

పెరట్లో మొహం కడుక్కొని కాఫీకి వంటింట్లో కెళ్ళి నప్పుడు "మళ్ళీ ఎన్నాళ్ళకి చూసేన్రా కావుడూ నీ మొహంలో కళ, ఆ ముండపోయాక" అంది తల్లి. మధ్యాహ్నం భోంచేస్తూ "ఈ వేళ వంట దివ్యంగా వుందమ్మా' అన్నాడు కామేశం నవ్వుతూ. "మా నాయనే ! మరి పులుసు మరో గరిటెడు వెయ్యనా" అంటూ వేశేసింది వాళ్ళమ్మ. జవాబు కోసం ఎదురు చూడకుండా "గ్రేట్ సక్సెస్" అనుకున్నాడు కామేశ్వర్రావు.

వేగం భోంచేసి ముస్తాబై విశ్వనాధం ఇంటి కెళ్ళేడు కామేశం "సరె. ఏమైతే ఆదే అవుతుంది ఆఫీసుకి రా" అన్నాడు విశ్వనాధం వేదాంతిలా. ఇద్దరూ కలసి ఆఫీసు కెళ్ళారు.

ఆఫీసులో మాత్రం వాతావరణం ఏమంత ప్రోత్సాహ కరంగా లేదు. ముందునాడు సాయంత్రం ఆఫీసరు పై అధికారి వూరెళ్ళి అతన్తొ జరిగిందంతా చెప్పి క్షమార్పణ కోరుకున్నాడు. అతను చెప్పిందంతా సానుభూతితో విన్నాడు పై అధికారి కాని మనస్ఫూర్తిగా క్షమించలేక పోయాడు.

కాబట్టి ఆఫీసరు పొరలో వున్న పాములా కదలకుండా గదిలోంచి బుసుకొడుతున్నాడు. కావేఁశం కూడా ఉత్సాహాన్నీ

ఆశనీ పట్టుకొని ఉయ్యాలలూగుతూనే వున్నాడు. జార్జికూడా అతనికి సలహా ఇచ్చాడు. "ఇంకా మళ్ళీ యిలంటి పొర పాటొస్తే క్షమించొద్దు. యీ సారికి మాత్రం మరిచిపో" అని ఆఫీసరుతో చెప్పమని.

మధ్యాహ్నం మూడుగంటలకి కావేఁశం ఆఫీసరు దగ్గరికి సంతకాల కెళ్ళాలి. మూడవుతున్నకొద్దీ విచి త్రంగా కామేశానికి తనలో తనకే నమ్మకమెక్కువవడం ప్రారంభించింది. తమ కష్టసమయాల్లో ఎలా ధైర్యం చిక్కబట్టుకునే వారో జ్ఞాపకం తెచ్చుకునేసరికి "యీ గండమెంత, క్షణంలో దాటేస్తాను" అని చెప్పుకున్నాడు కావేఁశం తినతో. మూడు కొడుతుండగా రూమా లులో మొహం గట్టిగా తుడుచుకొని, జుత్తు చేత్తోనే సర్దుకొని, కాయితాలతో సహా ఆఫీసర్ గదిలో కెళ్ళేడు కావేఁశం పుస్తకంలో చెప్పిన నవ్వు మొహంమీద అచ్చుకొట్టుకొని.

తలొంచుకొని పనిచేస్తున్నన్న ఆఫీసరు తలెత్తేసరికి కావేఁశం కనిపించగానే తల కొట్టేసినట్టనిపించింది, తన అవమానం గుర్తుకొచ్చి వెంటనే కావేఁశం తల తీసేద్దామనిపించింది. ఇది వరకు కావేఁశం ఏన్ని పొరపాట్లు చేసినా కేవలం చీవాట్లు పెట్టి వ్యవహారం కాగితం మీదికి రాకుండా సర్దుకుపోయేవాడ తను. కామేశం చేసిన అఘాయిత్యానికి, తన కన్ఫర్మేషన్ రెండేళ్ళు వాయిదా పడే సూచనలున్నా అతను సర్దుకుపోడానికే ప్రయత్నిస్తున్నాడు కాని...కాని అతనికి కావేఁశం నువ్వు భరించశక్యం కాకపోయింది. పిచ్చివాణ్ని చేసింది. దారితప్పిన పిల్లాడు యిల్లు చేరేక 'నే నొచ్చేశానమ్మా' అన్నట్టుంది ఆ నవ్వు. పొదరింట్లో దాగున్న నాయకుడ్ని చూసి 'యిక్కడున్నావా దొంగా?' అని ప్రబంధ నాయకి పల్కినట్టుంది ఆ నవ్వు.

తనకి అనుకోనిరీతిగా కావేఁశమ్మూలాన ఆపద వచ్చాక ఆఫీసరు 'యీ ప్రపంచంలో ఏదయినా సాధ్యమే ! ముఖ్యంగా చెడ్డ' అనుకొని. అన్ని ఆపదలు ఎదు ర్కొవడానికి సిద్ధమయ్యాడు. కావేఁశంలో పిల్లాడినవ్వు, ప్రబంధనాయకి నువ్వ తప్ప తనని ఎకసెక్కం చేస్తున్నట్లుందా నవ్వు.

'ఏవిఁటా వెర్రి నవ్వు? వెరి వాలకవూఁనూ?' పెడ బొబ్బ లెట్టేడు ఆఫీసరు.

మనుసులో స్పీచి అల్లుకుంటున్న కావేఁశానికి అకస్మాత్తుగా ఆఫీసరు ఎందుకు నురగలు కక్కుతున్నాడో తెలీలేదు. ప్రయత్నిం చేలోగానే అక్కడేవున్న విశ్వనాథం కావేఁశం చేతిలోంచి ఫైలు లాక్కుని అతన్ని పైకి తోసేయడం, అతను వెళ్ళి తన సీటులో కూర్చోవడం, 'ఏమైందేమైంది' అంటూ మిగతా గుమాస్తాలంతా అతనిచుట్టూ చేరడం, 'తెలీదు' అతను జవాబు చెప్పేయడం జరిగిపోయేయి. 'నువ్వేంభయపడకు బ్రదర్' అని సానుభూతితో ధైర్యం చెప్పేడు జార్జి.

నిజానికి కావేఁశం భయపళ్ళేదు. ఉత్సాహం జార విడవ లేదు. ఏం జరిగిందా అని తెలుసుకునేందుకు ప్రయత్నం మాత్రం చేస్తున్నాడు.

'ఎన్నిసార్లు చెప్పినా నువ్వెందు కతనికి ఛార్జెస్ యివ్వవ్!' అని ఆఫీసరు విశ్వనాథాన్ని గదమాయి స్తున్నాడు గదిలో.

'ఏదో తమ యింట్లో శుభకార్య మయ్యేలోగా ఈ పనెందుకని ఆలోచిస్తున్నానంతే. యింకేం కాదు. ఎల్లుండి చార్జెస్ సిద్ధం చేసేస్తాను' అని నచ్చజెప్పాడు విశ్వనాథం.

ఆఫీసరుకి ముందు ఒక్క కొడుకు పుట్టేడు. తర్వాత కుమార్తేనా పుట్టలేదు చాల్నాళ్లు. ఇంక పుట్టరనుకొన్న టైముకి పుట్టేరు పిల్లా పిచ్చికాను. ఆవేళ పిచ్చికది మొదటి పుట్టినరోజు. అదే విశ్వనాథం చెప్పిన శుభకార్యం. ఆఫీసరు గారిదృష్టిలో అది పెళ్ళంత శుభ కార్యం, అతని భార్యదృష్టిలో యింకా పెద్దకార్యం వుంటే అదే.

అంచేత వాళ్ళిద్దరూ పెద్ద పెట్టున ఏర్పాటు చేశారు. ఊళ్ళో వున్న ఫ్రెండ్సందరికీ సాయంత్రం టీతో సహా అన్నీ అయ్యేయి. కేవలం తనస్టాఫ్‌కి మాత్రం విందు ఏర్పాటు చేశారా రాత్రి.

విందుకి అంతమందీ వచ్చేరు కావేఁశంతో సహా, ముస్తాబై దూరాన చీకట్లో ట్యూబ్‌లైట్లా మెరిసిపోతుంది జానకి. ఆమె చుట్టూ దూరాన చీకటిలా వున్నాడు జార్జి.

శలవు మీదున్న యముడిలా ఆఫీసరు యింటి దగ్గరున్న ప్పుడు మంచివాడే. తన స్టాఫందరి తోనూ తన తాహతును. మరచిహుషారుచేస్తూచ, విందంత సేపూ వాళ్ళని యింకా తిన మని హెచ్చరిస్తూనే వున్నాడు. కావేఁశానికి మాత్రం తిట్టక పోవ డమే ఆయన చూపిన ఆదరణ.

విందు పూర్తయ్యేసరికి రాత్రి పదిన్నరైంది. పొద్దుటి నుండి నలిగి సతమతమౌతున్న ఆఫీసర్‌కి ఆయన భార్యకి కూడా ఎంతట పక్క చేరుదామా అని వుంది. అంతా లేచారు. శలవు తీసు కోవడమే తరవాయి. నిద్రపోతున్న పిల్లణ్ని లేపి తీసుకువచ్చి

మరీ చూపిం చింది. వాళ్ళందరికి ఆఫీసరు భార్య. ఆమెకు కావేంశం అంటే ప్రత్యేకాభిమానం, అతను అమాయకుడని. అదీ కాక అతనితల్లి వాళ్ళయింట్లో సమయాసమయాల్లో వంట చేసి వాళ్ళకి సహాయం చేసేది.

'ఏం కావేంశంగారూ ! ఎలా వున్నాడు మావాడు?' అంది, వాళ్ళవాడ్ని కావేంశం మొహం దగ్గరగాపెట్టి వాళ్ళ వాడు ఆవలిం చేడు. ఇంత సేపటికి అతన్ని మాట్లాడమన్న ఆహ్వానం వచ్చింది.

"దివ్యంగా వున్నాడు దీపంలా. అందగాడు మీలాగే– (ఆఫీసరు కనుబొమ్మలు మీదికి వెళుతున్నాయి). చురుక్కి మా ఆఫీసరుగారే ఐనా అందానికి మిమ్మల్నే పోలాడు. నిజం చెప్పా లంటే మీరు చాలా అందంగా వుంటారు––(పళ్ళు పట పట లాడుతున్నాయి.) మీరు చాలా చిన్న పిల్లలావుంటారు. (పిడి కిళ్ళు బిగిస్తున్నాయి) నిజానికి మీరు ఆఫీసరుగారి భార్యని ఎవరూ అనుకోరు మీరు..

విశ్వనాథం కామేశం కాలిమీద తన్ని అతని నోరు మూశాడు.

కావేంశం చెప్పింది అక్షరాలా నిజం. పొగడ్తేంలేదు. ఆఫీసరు గారికి రెండో వివాహం. అతనిభార్య అందగత్తే. చిన్నదీ కూడా. నిజంచెప్తే ఎందుకు విశ్వనాథం తన కాలు నలిపేశాడో తెలీక కామేశం అందర్నీ కలియచూశాడు. ఆఫీసరుగారి భార్య కొంప లంటుకున్నట్టు పిల్లన్నెత్తుకొని పారిపోతూంది. అంతా ఎప్పుడు పేల్తుందో తెలీని ఏటం బాంబుని పట్టుకున్నట్టున్నారు. ఆఫీసరు పేలబోయే ఏటంబాంబులా పొగకక్కి పేలాడు 'టేక్ హిమ్ ఎవే బిఫోర్ ఐ కిల్ హిమ్'.

హత్య జరిగినట్లున్న వాతావరణంలో ఎవరూ శలవు తీసు కోకుండానే కావేంశాన్ని యీడ్చుకుపోయారు. గేటు దాటగానే 'రేపు ఆఫీసు కిన్ని నువ్వులు పట్రా, ఉద్యోగానికి నీళ్ళొదిలేద్దువు గాని' అని విశ్వనాథమే నిశ్శబ్దాన్ని పోగొట్టాడు.

రెండవసారి పేలబోయే బాంబులా ఘూర్ణిల్లుతున్న ఆఫీసరు వరండాలోంచే కేకవేశాడు, ప్రతి అక్షరం వత్తి పలుకుతూ, 'విశ్వనాథం' అని. విశ్వనాథం వెనక్కి పరి గెత్తేడు, సార్ అంటూ.

మిగతావాళ్ళంతా ఎక్కువదూరం కలిసి నడవలేదు. వీధి చివరి చేరగానే మార్గాలు విడిపోయాయి. కామేశని డొక్కడిదీ ఒక తోవ, మిగిలిన వారందరిదీ ఒక తోవ.

కామేశం ఒక్కడూ నడుస్తున్నాడు. వీధిలైట్ల నీరసంగ కాలు తున్నాయి. మేఘాలు చంద్రుణ్ని కప్పివేస్తున్నాయి. పొగముంచు తెరలు ఒకటొకటి కావేంశాన్ని కప్పివేస్తు న్నాయి. అంచులు కరుగుతూ ముందుకు నడుస్తున్న కామేశం మరీ అస్పష్టంగా ఆకారరహితుడై, మాయని పొడుగాటి మచ్చలా సాగిపోతున్నాడు.

కావేంశం వెళ్లిపోయాడు రైలు స్టేషనువైపు. స్టేషన్ చేరాకట ిక్కట్టు కొనుక్కుని ఏ వూరయినా పోవచ్చు–లేక టిక్కెట్టు కొనకుండా ఏరైలు క్రిందయినా పడొచ్చు–అదీగాక పోతే వారం రోజుల్లో గొప్పవాడవడానికి మరేదయినా పుస్తకంకొనుక్కొని రావచ్చు. అవి కేవలం అతనికి సంబంధించిన విషయాలు.

చిన్న కథలకి తొలిమాటలుండవు అంచేత చివర నోమాట. తెలివయినవారూ, చురుకైనవారూ సంఘంలో తమ స్థానాన్ని తామే నిర్ణయించుకోగలరు. కావేంశం లాంటి అదృష్టహీనుల్ని ఆదరించగలిగినదే ఉత్తమ సంఘం.

**(యువ దీపావళి, 10.11.1965)**

# పిరికివాడి ప్రేమ

"అల్లాడీ అంబేద్కరూ భారత రజ్యాంగ చట్టం రాసినప్పుడంత ఆలోచించి యుండరు. మేగ్నకార్టాలో సంతకం జెయ్యటానికి కింగ్‌జాన్ అంత సంకోచించి వుండడు. రాజేశ్వర్రావా ఉత్తరం అంత ఆలోచించి రాసి అంతా సంకోచించి సంతకం చేశాడు.

అసలు రజేశ్వర్రావేదీ బాగా ఆలోచిస్తేనే గానీ చెయ్యడు. స్వతహాగా చాలాజాగర్తయిన మనిషి, నిదానం అతని సొత్తు. వయసు చిన్నదైనా దురుసుతనం లేదతనికి. తనకితండ్రి నెల్నెలా పంపించే డబ్బులో ఎంతో కొంత మిగిల్చినా తొందరపడి ఎవరికీ అప్పులివ్వడు. అంత మాత్రాన కేపిటలిస్టు పోకడలున్నా యనడా నికి వీల్లేదు. కమ్యూనిష్టు కాకపోయినా అగ్గిపుల్లా, అరటి తొక్కలాంటి కమ్యూనిష్టు కథలంటే కాలిన ఇల్లూ, ప్రేమ మఠం లాంటి ప్రేమ సీరియల్సుకంటె ఎక్కువిష్టం, అలా అంటే ప్రేమంటే ఇష్టంలేదనీ రసజ్ఞుడుకాడనీ అనడానకి అసలే వీల్లేదు. అసలతని కొంపముంచింది ప్రేమే!

బీయేస్సీ మూడో ఏడు చదువుతున్న రిటైర్డ్ తాసీల్దార్ పరం ధామయ్యగారి రెండోకొడుకు (బీయేస్సీ చదువు తోంది తాసిల్దారు కాదు – అతని కొడుకు) రాజేశ్వర్రావు బియే మొదటి సంవత్సరం